


అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

భిక్కనూరు, జూన్ 22: మండలంలోని జంగంపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, సానిటేషన్ పనులు నాణ్యతతో చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. శనివారం జిల్లా పంచాయతీ అధికారి పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిశీలించాలని మండల అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పీఆర్ ఏఈ సోహేల్, హెచ్ఎం. రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో.. అయోమయం!



కామారెడ్డి, జూన్ 22(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో తిరుగులేని శక్తిగా ఎదిగిన బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీ ప్రభావం కోల్పోతూ వస్తోంది. ఏళ్లుగా గులాబీ జెండాను మోసిన వారు సైతం కండువా మార్చేస్తున్నారు. ద్వితీయస్థాయి క్యాడరే కాకుండా ఎమ్మెల్యేలు మాజీ ఎంపీలు పార్టీ మారుతుండడంతో గులాబీ క్యాడర్‌లో అయోమయం నెలకొంటుంది. వలసలను గులాబీ అధిష్ఠానం నివారించకుంటే జిల్లాలో పార్టీ మనుగడకే ప్రమాదం రానుందని పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్‌ఎస్‌ను వీడగా తాజాగా ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు పెద్దదిక్కైన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో బాన్సువాడలో బీఆర్‌ఎస్ పూర్తిగా ఖాళీ అయిందని స్థానికంగా చర్చ సాగుతోంది. మరికొందరు నేతలు సైతం పార్టీని మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి.

బాన్సువాడలో బీఆర్‌ఎస్ ఖాళీ

బాన్సువాడ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చివరకు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి వలస వెళ్లారు. తాజాగా ఎమ్మెల్యే ఆయన తనయులు, సోదరుడు పోచారం కుటుంబం మొత్తం కాంగ్రెస్‌లో చేరడంతో బాన్సువాడలో దాదాపు కారు మొత్తం ఖాళీ అయినట్లేనని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే బాన్సువాడలో బీఆర్‌ఎస్ పార్టీని ప్రస్తుతం నడిపేవారు ఎవరనే దానిపై అటు బీఆర్‌ఎస్‌తో పాటు ఇతర పార్టీల్లోనూ చర్చ మొదలైంది. బీఆర్‌ఎస్‌లో ప్రస్తుతం ఉన్నవారినైన పార్టీ కాపాడుకుంటుందా చూడాలి. పోచారం కుటుంబం మొత్తం కాంగ్రెస్‌లో చేరడంతో మిగిలిన ఆయన అనుచర వర్గం ఆయన వెంటే నడిచేందుకు సిద్ధమయ్యారని సమాచారం. బాన్సువాడలో రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని వలసలు పెరిగే అవకాశం ఉంది.

జిల్లాలో తగ్గుతున్న బీఆర్‌ఎస్ బలం


మలిదశ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న కామారెడ్డి జిల్లాలో పరిస్థితులు రోజురోజుకూ మారిపోతుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడంతో చాలా మంది బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నందున వలసలు జోరందుకున్నాయి.

- పార్టీని వీడుతున్న ముఖ్యనేతలు
- పార్లమెంట్ ఎన్నికల సమయంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్
- తాజాగా ఎమ్మెల్యే పోచారం.. బీఆర్‌ఎస్‌లో ఆగని వలసలు
- మరికొందరు కాంగ్రెస్ వైపు చూపు
- కాంగ్రెస్‌లో పెరుగుతున్న బలం
- జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

ప్రధానంగా జిల్లాలో కారు ఖాళీ అవుతుంది. కారు దిగుతున్న నేతలు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఇటీవల కాలంలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని పలువురు కౌన్సిలర్‌లు, సీనియర్ నాయకులు పార్టీని వీడుతూ కాంగ్రెస్‌లో చేరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలనే ఆరాటంతో ఉన్న వారు బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ లీడర్లు పార్టీని వీడుతున్నప్పటికీ ఆ పార్టీ నాయకత్వం నిల్వరించలేకపోతోంది. దీంతో గులాబీ శ్రేణుల్లో అయోమయం నెలకొంటుంది. జిల్లాలో బీఆర్‌ఎస్ బలం సైతం తగ్గుతోంది.

వలసలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్

జిల్లాలో కాంగ్రెస్ బలం పెంచుకోవడమే లక్ష్యంగా ఆ పార్టీ అధిష్ఠానం జిల్లా నేతలు పావులు కదుపుతున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల నుంచే ఇతర పార్టీల నుంచి నేతలను కార్యకర్తలను చేర్చుకునేందుకు కాంగ్రెస్ ద్వారాలు తెరిచింది. దీంతో పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులతో పాటు సీనియర్ నేతలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు, ఐసీడీ ఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, పున్న రాజేశ్వర్, నిమ్మ మోహన్‌రెడ్డి, మామిండ్ల అంజయ్య తదితరులు కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకు న్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సుమారు 20 మందికి పైగా కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని సైతం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఇలా నియోజకవర్గ స్థాయి నేతలే కాకుండా ఆయా మండలాలు, పట్టణాల్లోని ముఖ్యనేత లుగా గుర్తింపు పొందిన వారే పార్టీని వీడుతుండడంతో రాబోయే రోజుల్లో వలసలు మరింత పెరిగి అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.



పట్టు కోసమే కాంగ్రెస్‌లోకి పోచారం!

- కుమారుల భవిష్యత్తు దృష్ట్యా బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత బాన్సువాడలో మారిన సీన్
- పోచారం, ఏనుగు రవీందర్‌రెడ్డి మధ్య ఆధిపత్య పోరు
- డీసీసీబీ చైర్మన్ పదవిని కోల్పోయిన కొడుకు భాస్కర్‌రెడ్డి
- ఇదే కొనసాగితే రాజకీయంగా దెబ్బ తింటామని ఆందోళన
- అనుచరుల ఒత్తిడితో కాంగ్రెస్ ఆహ్వానానికి పోచారం ఓకే
- ఆయన చేరికను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్‌లోని స్థానిక నేతలు

కామారెడ్డి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) :

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు విధేయుల్లో ఒకరైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి వెళ్లడాన్ని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మంత్రి, స్పీకర్ పదవులను కట్టబెట్టిన కేసీఆర్.. ఆయన్ను లక్ష్మీపుత్రుడిగా అభివర్ణించారు. అలాంటి పోచారం.. బాన్సువాడలో తన పట్టు నిలుపుకోవడంతో పాటు కుమారులు భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా పార్టీ మారక తప్పని పరిస్థితి నెలకొందన్న ప్రచారం సాగుతోంది. బాన్సువాడ నుంచి 8 సార్లు పోటీ చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి 7 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో మొదటిసారిగా టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీడీపీ హయాంలో గృహ నిర్మాణశాఖ, భూగర్భ గనుల శాఖ, గ్రామీణ పంచాయతీ శాఖల మంత్రిగా పని చేశారు. 2011లో తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీకి, ఎమ్మెల్యేకు రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరి ఉప ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014, 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున గెలుపొంది రాష్ట్ర మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా పని చేశారు. స్పీకర్‌గా పని చేసిన వారంతా ఓటమి చెందుతారన్న సెంటిమెంట్‌ను బ్రేక్ చేస్తూ.. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డిపై 23,464 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బాన్సువాడలో ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధిపత్యమే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పోచారం అనుచరవర్గానికి ఉన్న ఇసుక కాంట్రాక్ట్‌లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు దెబ్బతినే పరిస్థితి ఉండడం, నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి తన అనుచరులకు రావాల్సిన రూ.150కోట్లకుపైగా బిల్లులు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉండడం వల్లే పోచారం ఈ నిర్ణయం తీసుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. పోచారం తనయుడు భాస్కర్ రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ పదవిని కోల్పోవాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, తర్వాత పోచారం ముఖ్య అనుచరులు ఒక్కొక్కరిగా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలం తగ్గుతూ వచ్చింది. ఇదిలాగే కొనసాగితే రాజకీయంగా మరింత దెబ్బతింటామని భావించడంతో పాటు తనయుల రాజకీయ భవిష్యత్తు కోసమైనా పార్టీ మారాలని అనుచరులు ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దల నుంచీ పార్టీలో చేరాలంటూ రాయబారాలు మొదలయ్యాయి. చివరకు శుక్ర వారం సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివా స్‌రెడ్డి స్వయంగా హైదరాబాద్‌లోని పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లి కలిశారు. అక్కడే పోచారానికి కాంగ్రెస్ కండువా కప్పారు. కాగా, పోచారానికి మంత్రి పదవి సైతం ఇవ్వబోతున్నారన్న చర్చ జరుగుతోంది.

పోచారం చేరికపై స్థానికంగా వ్యతిరేకత

బాన్సువాడలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్‌కు కాకుండా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికి అధిష్ఠానం టికెట్ కట్టబెట్టింది. ఆ ఎన్నికల్లో ఇరువర్గాలకు సంబంధించిన వారు ఒక్కటై ప్రచారం చేసినప్పటికీ.. ఏనుగుకు ఓటమి తప్పలేదు. దీంతో ఎన్నికల తర్వాత ఏనుగు రవీందర్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్ అనుచరులు రెండు వర్గాలుగా ఏర్పడ్డారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రె డ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని ఏనుగు రవీందర్ రెడ్డి అనుచరవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పోచారం చేరికను నిరసిస్తూ ఆ పార్టీలోని ఓ వర్గానికి చెందిన వారు బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్, కోటగిరి మండలాల్లో పోచారం దిష్టిబొమ్మను దహనం చేశారు.

విధులు సక్రమంగా నిర్వహించకుంటే కఠిన చర్యలు తప్పవు

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

రామారెడ్డి, జూన్ 22: విధులు సక్రమంగా నిర్వహించని అధికారులు, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి మండలం సింగరాయిపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత అమ్మ ఆదర్శ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విధి నిర్వహణ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థిని విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా నిర్వహించాలని పలు సలహాలు, సూచనలు పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ శాలిని, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపతి, ఏఈ సంతోష్, ఐకేపీ ఏపీఎం ప్రసన్నకుమార్, పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్, ఐకేపీ సీసీ దుర్గాదాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

'ఇక నుంచి ప్రీస్కూల్‌గా అంగన్‌వాడీలు'

మద్నూర్, జూన్ 22 : మద్నూర్ ప్రాజెక్టు పరిధిలోని 208 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ప్రీ స్కూల్ అంగన్‌వాడీగా మార్చనున్నట్లు సీడీపీవో సునంద వెల్లడించారు. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని ఇందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలు ప్రీ స్కూల్స్ తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయనున్నట్లు తమకు సమాచారం వచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగానే సూపర్‌వైజర్లకు విద్యాబోధనపై శిక్షణ ఇచ్చారని వారు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మద్నూర్ ప్రాజెక్టు పరిధిలో విడతల వారీగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రీ స్కూల్‌గా ఎంపికైన కేంద్రాలకు సరఫరా చేసే పుస్తకాలు, సిలబస్ కూడా కొంత మార్పు ఉంటుందని అన్నారు. విద్యాబోధనలో మార్పులో భాగంగా ఇప్పటి వరకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో విద్యాబోధన చేపడుతున్నారు. అయితే ప్రీ స్కూల్స్ లో మూడు నుంచి ఆరేళ్ళ లోపు పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలుగా ప్రేరణాత్మక కృత్యాధార బోధన ఉంటుందని తెలిపారు. జూన్ నుంచి ఆగస్టు వరకు ఆట పాటలు సైన్స్ యోగ పూర్వ గణితం రంగులు ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.



ప్రీ స్కూల్‌గా మారనున్న అంగన్‌వాడీ

రైతు వేదికలు వెలవెల!

- రైతు వేదికలకు ఏడాదిగా అందని నిధులు
- భారంగా మారిన నిర్వహణ
- ఇబ్బందుల్లో ఏఈవోలు
- రైతులకు అందని సలహాలు, సూచనలు

ఎల్లారెడ్డి, జూన్ 22: రైతులకు వ్యవసాయంలో ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు వ్యవసాయ శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఎప్పటికప్పుడు సాగు వివరాలు విత్తనాల ఎంపిక ఎరువుల వినియోగం పంటల అమ్మకాల్లో తోడ్పాటుగా ఉంటూ అన్ని అంశాల్లో అండగా ఉండాలని ఉద్దేశంతో రైతు వేదికలు నిర్మాణాలు చేపట్టారు. వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించడం, సలహాలు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం ప్రతీ ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా గుర్తించి 22 లక్షలతో రైతు వేదికలను నిర్మించింది. అయితే రైతు వేదికల్లో ఏఈవోలు ఈ వానాకాలంలో విత్తనాల గురించి వివరించి ఆలోచన చేయలేదు. పంటల వివరాలు సేకరించి ఆన్‌లైన్ నమోదుకు పరిమితం అవుతున్నారు తప్ప ఇతర కార్యకలాపాలు నిర్వహించడం లేదు.

తెరచుకోని రైతు వేదికలు

చాలా వరకు ఎల్లారెడ్డి మండలంలోని రైతు వేదికలను తాళాలు వేసి మూసి ఉంటున్నాయి. ఆన్‌లైన్ పంట విత్తనాలు పంట వివరాలు నమోదు, సమావేశాలకు మాత్రమే పరిమితమవుతున్నారు. పంటల సాగులో రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు, విత్తనాలు టో కెన్లు, రైతుల వేదికలలో ఇవ్వాలని పలువురు రైతులకు కోరుతున్నారు.

మండలంలో నాలుగు రైతు వేదికలు

ఎల్లారెడ్డి మండలంలోని మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో ఐదు వేల ఎకరాలకు ఒక రైతు వేదికలను నిర్మించారు. మండలంలో ఎల్లారెడ్డి, అన్నాసాగర్, జంగమయ్యపల్లి, గండి మాసానిపేట్ గ్రామాల్లో రైతు వేదికలను నిర్మించారు. మొత్తం రైతులు సుమారు 14,560 రైతులు ఉంటారు. 19 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఒక్కో రైతు వేదికలో ఒక వ్యవసాయ విస్తీర్ణ అధికారి అందుబాటులో ఉండి వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ ఉన్నత అధికారుల సూచనల మేరకు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులకు పంటల సాగుపై ఎరువులు విత్తనాలు పంటలు పండించడానికి కావాల్సిన సూచనలను రైతులకు తెలియజేస్తారు.

ఏడాదిగా అందని నిర్వహణ నిధులు

ఒక్కో రైతు వేదిక నిర్వాహణకు నెలకు రూ.9 వేల చొప్పున ఖర్చు అవుతోంది. గత ప్రభుత్వం అంచనా వేసింది. వాటిలో విద్యుత్ బిల్లుకు రూ. వెయ్యి, రైతుల శిక్షణకు 2,500, పారిశుద్ధ్య నిర్వహణకు 3వేలు, తాగునీటికి రూ.500, మరమ్మతులు స్టేషనరీ జిరాక్స్‌కు ఇతర ఖర్చుల కోసం రెండు వేలు కేటాయించారు. ఈ మేరకు రైతు వేదికలకు ఏప్రిల్ వరకు నిధులు విడుదలయ్యాయి. అప్పటి నుంచి నిధులు నిలిచిపోవడంతో రైతు వేదికల నిర్వహన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించడం ఇబ్బందికరంగా మారిందని ఏఈవోలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న రైతు వేదికలో నిర్వహణ నిధులు త్వరగా విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

ఆయా రైతు వేదికల్లో కనీసం తాగడానికి కూడా మంచినీటి సౌకర్యాలు లేదు. చాలా చోట్ల రైతు వేదికల్లో స్వీపర్ లేకపోవడంతో దుమ్ముతో దర్శనమిస్తున్నాయి. రైతులకు కుర్చీలు కూడా సరిగ్గా లేవు. ఏఈవోలు తూతూమంత్రంగా వచ్చి వెళ్లిపోతున్నారు. కొన్ని రైతు వేదికలకు తాళాలు తీసే దిక్కేలేరు. తీసిన ఒక గంట పాటు ఉండి ఫీల్డ్ పేరుతో వెళ్లిపోతున్నారు. రైతు వేదికల్లో టాయిలెట్ లేక మహిళా ఏఈవోలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అప్పటి ప్రభుత్వం హడావుడిగా రైతు వేదికలు నిర్మించి పూర్తి సౌకర్యాలు కల్పించలేదు. అరకొర సౌకర్యాలతో చేతులు దులుపుకున్నారని రైతులు ప్రజల వద్ద నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా రైతు వేదికలో రైతులకు ఉపయోగపడే విధంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి విధులు నిర్వర్తించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



నిధులు విడుదల చేయాలి

- రైతు, సాయిలు

రైతు వేదికల నిర్వహనకు నిధులను ప్రభుత్వం విడుదల చేయాలి. నిర్వహన నిధులను సకాలంలో విడుదల చేయకపోతే రైతు వేదికలు నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. రైతులకు పంటల సాగులో సూచనలు, సలహాలను అందించేందుకు సమావేశాలను నిర్వహించే పరిస్థితి ఉండదు.

ఏడాదిగా నిధులు రావాల్సి ఉంది

- హరీష్, మండల వ్యవసాయ అధికారి

రైతు వేదికల నిర్వహణకు గత సంవత్సరం నుంచి నిధులు విడుదల చేయడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ, రైతులకు శిక్షణ, తాగునీరు తదితర వాటికి ఏఈవోలు సొంత ఖర్చుతో మెయింటెనెన్స్ చేస్తున్నారు. ఏఈవోలు ప్రతిరోజూ రైతు వేదికలకు వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలి.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా ?



చెక్ డ్యామ్ మధ్యలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



విద్యుత్ స్తంభాలను తొలగించాలని వినతిపత్రం అందజేస్తున్న రైతు

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

ఎల్లారెడ్డి, జూన్ 22: ఎల్లారెడ్డి మండలంలోని అడవి లింగాల గ్రామ శివారులోని కల్యాణి వాగుపై నూతన చెక్ డ్యామ్ 2020 సంవత్సరంలో సుమారు 1.80 కోట్ల రూపాయలతో మంజూరు అయింది. విద్యుత్ శాఖ అధికారులు 2023లో ముందు చూపు లేకుండా నీటిపారుదల శాఖ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ అధికారులు కళ్యాణి వాగుపై ఇష్టారాజ్యంగా నూతన విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చెక్ డ్యామ్ నిర్మానం పూర్తయింది. అయితే మూడు విద్యుత్ స్తంభాలు చెక్ డ్యామ్ మధ్యలో కావడంతో వర్షాలు కురిస్తే ఆ ప్రాంతంలో భారీ వరదలు వచ్చే అవకాశాలు ఉంటాయి. వరదల ఉధృతికి విద్యుత్ స్తంభాలు కూలిపోయి వాగులో పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా స్తంభా లు కూలిపోతే ఆ ప్రాంత రైతులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతాయి. విద్యుత్ స్తంభాలను తొలగించాలని రైతులు విద్యుత్ శాఖ ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశారు. గత రెండు రోజులక్రితం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అధి కారుల సమీక్ష సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులపై చాలా ఫిర్యాదులు వస్తున్నానయి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు, అధికారు లు ప్రజాప్రతినిధులు చెప్పినా కూడా తమకేమి పట్ట నట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నత అధి కారులు విచారణ చేపట్టి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగిం చాలని రైతులు కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యం

● ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య

బాన్సువాడటౌన్, జూన్ 22: కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సంఘం , భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డును సాధించిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. సహజ మరణం పొందిన కార్మికులకు 10 లక్షల రూపాయలు , 55 సంవత్సరాలు నిండిన బోర్డు సభ్యులందరికీ 5 వేల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి దుబాస్‌రాములు , శంకర్ , ఎల్లయ్య , సాయిలు , సురేష్ , అంజయ్య , లక్ష్మీ , పోచవ్వ , జ్యోతి తదితరులున్నారు.

నేడు నల్ల పోచమ్మ పండుగ

మద్నూర్, జూన్ 22 : మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం నల్ల పోచమ్మ పండుగ జరుపుకోవ డానికి గ్రామ పెద్దలు నిర్ణయిం చారు. ఇందులో భాగంగా ఆయా కుల సంఘాల వారు సమావేశాలను ఏర్పాటు చేసుకుని నల్ల పోచమ్మ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని తీర్మానించారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో నల్ల పోచమ్మ పండుగ జరుపుకోవడం ఆచారంగా వస్తుంది. అదే విధంగా ఈ ఏడాది గ్రామంలో కలిసికట్టుగా అన్ని కుల సంఘాలు కలిసి పండుగ జరుపుకోవాలని నిర్ణయించారు.

ప్రారంభమైన పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 22:పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్-2024 మొదటి విడత కౌన్సెలింగ్ సర్టిఫికెట్ల పరిశీలన శనివారం ప్రారంభమైంది. నగరంలోని బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. ఈనెల 25 వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త శ్రీరాంకుమార్, సిస్టమ్ అడ్మిన్ భానుచందర్ తెలిపారు. సర్టిఫికెట్ పరిశీలన పూర్తయిన విద్యార్థులు తప్పనిసరిగా వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని వెబ్ఆప్షన్లు చేసుకున్న వారికి మాత్రమే సీటు కేటాయింపు ఉంటుందని వారు తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని వారు తెలిపారు. శనివారం 425 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు.

నగరంలో పెట్రేగుతున్న భూకబ్జాదారులు

● రిజిస్ట్రేషన్ అధికారుల సహకారంతో ఇతరుల స్థలాలకు రిజిస్ట్రేషన్లు ● తీరు మార్చుకోని అధికారులు
● కాంగ్రెస్ పార్టీ భూముల కబ్జాపై ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ సీరియస్

ఖిల్లా, జూన్22: నగరంలో భూకబ్జాదారుల ఆగడాలు పెట్రేగిపోతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖాధికారుల సహకారంతో ఇతరుల భూములను అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న ఘటనలు నగరంలో వెలుగు చూస్తున్నాయి. నగరంలో ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు వాటికి సంబంధించిన వివరాలను సేకరించి వాటి వారసులు లేకున్నా ఉన్నట్లు పత్రాలు సృష్టించి తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నట్లు ఇటీవల జోరుగా సాగుతున్నాయి. గతంలో నకిలీ పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసినా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంతో మరోసారి ఇటువంటి వాటికి అక్రమార్కులు తెరలేపుతున్నారు. తాజాగా నగరంలోని ధారుగల్లీలోని అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థలాలను కొందరు అక్రమార్కులు అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. అందుకు సహకరించిన రిజిస్ట్రేషన్ శాఖాధికారి గతంలో కూడా ఇటువంటి రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నకిలీ పత్రాలు సృష్టించి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేశారు. నగరంలోని దారుగల్లీ, హైమదీబజార్ సమీపంలో కాంగ్రెస్ డీసీసీ పేరిట వ్యాపార సముదాయాల స్థలాలు ఉన్నాయి. 8-4-359 ఇంటి నంబరు పేరిట ఏడు అసెస్మెంట్ నెంబర్లు ఉన్నట్లు సమాచారం. అక్రమార్కులు ఆ నంబరుకు /1వేసి తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. బై/1వేసిన నంబరులో సుమారు 43.65 గజాల స్థలాన్ని కబ్జాదారులు తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలానికి నిబంధనలు లేకుండా అడ్డదారుల్లో మున్సిపల్‌లో నమోదు చేయించుకున్నారు. మున్సిపల్ రికార్డుల్లో పక్కాగా వివరాలున్నా పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ పూర్తిచేసినట్లు సమాచారం. ఆ స్థలం విలువ సుమారు లక్షల్లో ఉన్నట్లు తెలిసింది.

● భూముల కబ్జాపై ఎమ్మెల్సీ సీరియస్

కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన భూములు కబ్జాకు గురవ్వడంపై ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ సీరియస్ అయ్యారు. నగరంలోని అహ్మదీబజార్ వద్ద గల కాంగ్రెస్ పార్టీకి చెందిన భూములను కొందరు కబ్జా చేసి విషయాన్ని తెలుసుకున్న ఆయన జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని అక్కడికి పంపి భూములను సందర్శించాలని, ఎక్కడెక్కడ భూములు ఉన్నాయో గుర్తించాలని సూచించినట్లు తెలిసింది. దీంతో కబ్జాకు గురైన స్థలాన్ని నగర అధ్యక్షుడు కేశవేణు, తాహెర్‌బిన్‌హందాన్ సందర్శించినట్లు తెలిసింది.

మత్తుపదార్థాల వినియోగాన్ని అరికడదాం

● ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

డిచ్‌పల్లి,జూన్ 22: తెలంగాణ రాష్ట్రాన్ని మత్తుపదార్థాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారం అందజేస్తామని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివారం రెండోరోజు బర్దిపూర్ శివారులో గల కృష్ణహోటల్లో నిర్వహించిన ఇండియన్ సైక్రియాట్రిక్ సొసైటీ, ఇందూరు న్యూరో సైకియాట్రిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక మహాసభలకు ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మత్తుపదార్థల నివారణ కోసం వైద్యులు ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలపై తెలంగాణ రాష్ట్ర సైకియాట్రిక్ అసోసియేషన్ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. మత్తుపదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని వైద్యులు కూడా ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. జాతీయ అధ్యక్షులు డా.లక్ష్మీకంత్రా టిడా.ప్రతీమ మూర్తి, డా.కిషన్



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

సైకియాట్రిక్ డాక్టర్ విశాల్, డా.జార్జిరెడ్డి, డా.ఫనికాంత్, సాయికిరణ్, రవితేజా, మీనాజ్, ఆశమౌనిక, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై విద్యార్థి సంఘాల దాడులు సరికాదు

● డీఈవోను కలిసిన ట్రస్మా ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 22:జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలపై విద్యార్థి సంఘాల దాడులు సరికాదని దాడులపై నిరసన వ్యక్తం చేస్తూ పాఠశాల నిర్వహణకు సహకరించాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానంద్, రాష్ట్ర అధికార ప్రతినిధి జయసింహగౌడ్‌లు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు, పాఠశాలల యాజమాన్యాలు కలిసి పనిచేస్తేనే మంచి విద్యను పిల్లలకు ఇవ్వడానికి వీలవుతుందని, ప్రైవేటు పాఠశాలలు ఇస్తున్న సౌకర్యాలు వ్యాపార దృక్పథంతో కాకుండా తల్లిదండ్రుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసినవిగా భావించి విద్యార్థి సంఘాలు సహకరించాలన్నారు. మన ప్రాంత విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన మంచి విద్యను అందుకోవడానికి సహకరించాలని విద్యార్థి సంఘాల సూచనలు, సలహాలు తాము ఆదరిస్తామని వారు అన్నారు. ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యార్థి సంఘాల పేరుతో కొంత మంది యువకులు పాఠశాలలపై దాడి చేస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులను, పాఠశాల యాజమాన్యాలను భయపెడుతూ పాఠశాల నిర్వహణకు ఆటంకం కలిగించడం సరికాదన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన విద్యార్థి సంఘాలకు, వారి ఉద్యమాలకు ప్రైవేటు పాఠశాలలు చేయూతను ఇస్తున్నాయని అన్నారు. కొంత మంది వ్యక్తులు సంఘాల పేరుతో బలవంతపు వసూళ్లు చేస్తూ బడ్జెట్ స్కూళ్లను, చిన్న చిన్న స్కూళ్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా ప్రతినిధులు

స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయని వారి జీతభత్యాలు కూడా సరిగ్గా ఇవ్వలేని పరిస్థితుల్లో పాఠశాలలు ఉంటే ఇలాంటి ఒత్తిడిల వల్ల మానసికంగా వేధపడుతూ చాలా మంది ప్రైవేటు పాఠశాలల నిర్వహకులు అప్పులపాలవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోజూరి అరుణ్, నగర అధ్యక్షుడు ధర్మరాజు, కోశాధికారి నాగరాజు, మోహన్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జోస్‌అలుక్కాస్‌లో ఆభరణాల కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్‌లు

నిజామాబాద్ అర్బన్, జూన్ 22:బంగారు ఆభరణాల కొనుగోలుపై వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను అందజేయడం సంతోషకరమని నగర మేయర్ దండునీతూకిరణ్ అన్నారు. శనివారం నగరంలోని జోస్ అలుక్కాస్ జ్యువెల్లరి షోరూమ్‌లో ఆఫర్ల ప్రారంభ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ఆఫర్ల బ్రోచర్‌ను మేయర్ ఆవిష్కరించారు. ఆభరణాల వ్యాపారంలో ప్రముఖంగా ఉన్న జోస్ అలుక్కాస్ ప్రత్యేక ఆఫర్లు ఇవ్వడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం బంగారు ఆభరణాల కొనుగోలుపై తరుగులో ఫ్లాట్ 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని, అలాగే డైమండ్ నగల కొనుగోలుపై 20 శాతం, ప్లాటినం నగర కొనుగోలుపై 7 శాతం డిస్కౌంట్ ఇస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సజయ్ పికె, అకౌంట్స్ మేనేజర్ సజేష్, ఫ్లోర్ మేనేజర్ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.



జోస్ అలుక్కాస్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నగర మేయర్

పది రోజుల్లో ధరణి సమస్యలు పరిష్కరించండి

● తహసీల్దార్‌ను ఆదేశించిన ఎమ్మెల్యే

డిచ్‌పల్లి,జూన్ 22:పది రోజుల్లోగా ధరణి సమస్యలను పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు ప్రత్యేకచొరవ చూపాలని పెండింగ్ సమస్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని గ్రామీణ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశం ఎంపీపీ చిన్నొళ్ల నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు గడిచిన 10ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ధరణి దరఖాస్తులు లక్షలాదిగా పెండింగ్‌లో ఉన్నాయని వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పరగణిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేరుస్తు ముందుకు సాగుతు న్నామని రైతాంగానికి 2లక్షల రుణామాఫీ కూడా క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఐకేపీ ఉద్యోగులు ఉద్యోగులగా పనిచేసుకోవాలని రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. 200యూనిట్ల కరెంట్ బిల్లు, 500రూ. గ్యాస్ , సిలిండర్ దరఖాస్తు చేసుకున్నవారు ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఇందుకు అధికారులు సహకరించాలన్నారు. పోడు భూముల రైతులకు పట్టా పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ధరణి సమస్యలు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో పరిష్కారమయ్యే పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటి పరిష్కారానికి అధికారులు సహకరించాలన్నారు. 400 ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని గ్రామాల్లో గిరిజన తండాల్లో రేషన్ షాపులు ఇన్‌చార్జ్‌లను నియమించకుండా ఆయా గ్రామాల వారికే బాధ్యతలు అప్పగించాలన్నారు దూస్‌గాం రోడ్డు నిర్మాణ పనులను టెండర్‌లు పిలిచిన కాంట్రాక్టర్ మహేందర్ పనులు చేయడానికి ముందుకు రావడం లేదని ఆర్ అండ్‌బీ ఏఈ మనోహర్ ఎమ్మెల్యేతో వివరించారు. రెండుమార్లు నోటీసులు కూడా కాంట్రాక్టర్‌కు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన గొర్రెల డీడీలు పెండింగ్ లో ఉన్నాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పంచాయతీ భవనాల నిర్మాణం, సబ్‌సెంటర్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పూర్తి స్థాయిలో శిథిలవస్థకు చేరినట్యాంకులను తీసివేయాలని వివరాలను నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా మండల సమావేశానికి వచ్చిన భూపతిరెడ్డిని ఎంపీపీ నర్సయ్య, జడ్పీటీసీ ఇందిరా,వైస్ ఎంపీ సాయిలులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంఈవో రాజగంగారం, ఇతర అధికారులు , ఎంపీటీసీలు అఫీసర్లు, పాల్గొన్నారు.



డిచ్‌పల్లి మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

రైతు రుణమాఫీపై కర్షకుల హర్షం

ఏర్గట్ల, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించడంతో శనివారం మండలంలోని కర్షకులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడం పట్ల అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డెలిగేట్ జడ్డం జీవన్, ముస్కు మోహన్, పన్నాల నర్సారెడ్డి, కురకుల భూమన్న, జితేందర్, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మోపాల్, జూన్ 22:మోపాల్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.పార్టీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు.

మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లిఫ్ట్ చైర్మన్

నందిపేట, జూన్22: ఉమ్మడి నందిపేట మండలంలో ఉన్న ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లిఫ్ట్ చైర్మన్ వినతిపత్రం అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని డీసీసీ డెలిగేట్ పెంట ఇంద్రుడు, లిఫ్ట్ చైర్మన్‌ల ఫోరం అధ్యక్షుడు మోర్తాడ్ బోజారెడ్డి ఆధ్వర్యంలో నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మత్తులు చేయాలని అందుకు తగినన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా లిఫ్ట్ చైర్మన్‌లు, తదితరులు ఉన్నారు.

సిరికొండలో ఎక్సైజ్ దాడులు



దాడులు నిర్వహించిన ఎక్సైజ్ అధికారులు

సిరికొండ, జూన్ 22:మండలంలోని గడ్డమీది తండా, నడిమితాండా, ముషీర్‌నగర్, వర్దన్‌తాండా, ఒంటిప్ప తండాలలో ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి నాటుసారాను పట్టుకున్నారు. ఈ దాడుల్లో 10లీటర్ల ఎల్‌టీఎస్ గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాదవ్ తెలిపారు. ఈ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ విలాస్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.స్వప్న, సిబ్బంది ఉన్నారు.

'ఆశలకు నష్టం కలిగించొద్దు'



వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

ఇందల్వాయి, జూన్ 22:ఆశలకు నష్టం కలిగించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆశకార్యకర్తలు వైద్య సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశలకు నష్టం కలిగించే విధంగా పరీక్ష పెట్టే విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ప్రస్తుతం ఇచ్చిన హామీలు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశవర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 33 సంవత్సరాలు, గ్రామీణ ప్రాంతాల్లో గత 19 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని ఆరంభం నుండి ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందారని అన్నారు. రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ విధానం ద్వారా పనిచేయడం, వివిధ రకాల జబ్బులకు పరీక్షలు నిర్వహించి అన్ని గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న మందులను ప్రజల ఇంటి వద్దకు వెళ్లి తగు జాగ్రత్తలను చెబుతూ ఎప్పటికప్పుడు ప్రజలకు సేవలు అందిస్తున్నామని కొత్తగా పరీక్ష విధానాన్ని తీసుకువచ్చి ఆశకార్యకర్తలకు నష్టం చేకూర్చవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షురాలు స్వప్న, ఆశాకార్యకర్తలు గంగలక్ష్మి, ప్రమీల, నిర్మల, హరిత, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న యూనియన్ నాయకులు

రెంజల్,జూన్22: మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన జర్నలిస్టు చింతల ప్రదీప్ గత నెలలో క్యాన్సర్‌తో పోరాడి మృతి చెందారు. శనివారం టీయూడబ్ల్యూజే ఐజేయూ యూనియన్ అధ్యక్షుడు ఎడ్ల సంజీవ్, ప్రధాన కార్యదర్శి అరవింద్ బాలాజీ, యూనియన్ నాయకులు పరామర్శించారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు. జర్నలిస్టుల యూనియన్ తరఫున కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, పిల్లల చదువుకు తమ యూనియన్ తరఫున బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చట్టం ప్రసాద్, సంజీవ్, మాజీసర్పంచ్ షైని మోహన్, పాత్రికేయులు కిరణ్, నాగిరెడ్డి, గంగాధర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి

వేల్పూర్, జూన్22: బీసీ కుల గణనను వెంటనే చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడు మొండి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో నేటికి బీసీల భవితవ్యం కోసం జరగాల్సిందంత జరగలేదన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓట్లేసే యంత్రాలుగానే చూశాయి తప్ప వాళ్ళ జీవన ప్రమాణాలను పెంచేందుకు చేసిందేమి లేదన్నారు. బీసీల అభ్యున్నతి అంటే ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లు ప్రకటించి చేతులు దులుపేసుకుంటున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్య వస్తే బహుజన మహా జనవళికి ఏం చేస్తారో చెప్పాలని 150ఏళ్ళ క్రితమే మహాత్మజ్యోతిరావుపూలే అడిగిన ప్రశ్నకు నేటికి సమాధానం దొరకలేదన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో రావల్సిన ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వాతంత్ర్యం మాత్రం ఇంక రాలేదన్నారు. దేశంలో సగానికి పైగా ఉన్న బీసీల కుల గణన ఇప్పటికీ జరగలేదన్నారు. కులగణన చేయాలన్న బీసీల డిమాండ్‌ను నెహ్రూ, ఇంది రాగాంధీ, రాజీవ్‌గాంధీ మొదలుకొని నేటి ప్రధాని మోదీ వరకు అందరు పక్కన బెట్టారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

బోధన్‌రూరల్,జూన్22: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసుతులను కల్పిస్తుందన్నారు. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని విశ్రాంత ఉపాధ్యాయుడు శివప్రసాద్ అన్నారు. శనివారం బోధన్ మండలంలోని అమ్దాపూర్, ఊట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సూర్యకుమార్, ప్రధానోపాధ్యాయులు ధన్‌రాజ్, అమ్దాపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఊట్‌పల్లి మాజీ సర్పంచ్ కృష్ణ గుప్తా, ఉపాధ్యాయులు ఉమా, రాధ,వాసవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి సీసీ రోడ్డు : జుక్కల్ ఎమ్మెల్యే



ధన్నూర్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

మద్నూర్, జూన్ 22:మండలంలోని దన్నూరు గ్రామంలో సీసీ రోడ్డు పనులను జుక్కల్ శాసన సభ్యు బలు లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సీసీ రోడ్లు వేసిన ఘనత పార్టీకే ఉందని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దన్నూర్‌లో ఐదు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులకు ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, నాయకులు మనోహర్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ నిర్వహణపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టరేట్‌కు వెళ్తున్న బార్‌అసోసియేషన్ న్యాయవాది

బిచ్కుంద, జూన్ 22: మండలంలోని గుండెనెమలి, ఖత్‌గావ్, హస్గుల్ గ్రామాలలో ఇసుక క్వారీలపై నిర్వహణపై బిచ్కుంద బార్ అసోసియేషన్ న్యాయవాదుల సభ్యుల అధ్యక్షుడు ప్రకాష్‌పటేల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజీరాలో పట్టాదారు భూములలో ఇసుక మేటలు తరలించేందుకు అనుమతులు పొందుతూ ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా అధిక ఇసుకలోడుతో ఇసుక తరలింపు వల్ల రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని అన్నారు. ఇసుక క్వారీలలో ప్రభుత్వం టీఎస్‌ఎండీసీ ఆన్‌లైన్ ద్వారా అనుమతి పొందిన వే బిల్లులతోనే ఇసుకను లారీలలో పరిమితి ప్రకారం తరలించాల్సి ఉండగా అలా కాకుండా వే బిల్లు లేకుండానే అక్రమంగా ఇసుక తరలించడం జరుగుతుందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లక్ష్మన్‌రావు, మల్లేశ్వర్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన



తాండూరులో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నాగిరెడ్డిపేట, జూన్ 22 : మండలంలోని వివిధ గ్రామాలలోని పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను శనివారం ఎంపీడీవో పర్భన్న పరిశీలించారు. మండలంలోని తాండూర్ ఉన్నత పాఠశాల, వదల్పర్తి ప్రాథమికోన్నత పాఠశాల, కిచ్చెన్నపేట, అక్కంపల్లి ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరగకపోవడం పట్ల ఎంపీడీవో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాలలు పునః ప్రారంభమై వారం గడిచినా పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేవని చేపట్టిన పనులను నాణ్యతగా జరిపి త్వరగా పూర్తి చేయాలని ఆయన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ అరుణ ప్రభ, పంచాయితీ కార్యదర్శులు బాల్‌రాజ్, సత్యనారాయణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి'

గాంధారి, జూన్ 22:విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీటీసీ శంకర్‌నాయక్ అన్నారు.శనివారం ఎస్సీ హస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యా ర్థులకు పూర్తిగా సౌకర్యాలు అందించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు.ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డెన్ నవీన్ పాల్గొన్నారు.

మైనారిటీ బాలికల వసతి గృహం పరిశీలన

కామారెడ్డిరూరల్,జూన్22:కామారెడ్డి పట్టణంలోని మైనారిటి బాలికల వసతి గృహన్ని శనివారం ఇన్‌చార్జి జిల్లా మైనారిటి సంక్షేమ అధికారి దయానంద్ సందర్శించారు.స్టోర్ రూమ్‌ను పరిశీలించారు.అనంతరం విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు.విద్యార్థినిలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.విద్యార్థినిలు తరగతులకు హజరయ్యే విధంగా చూడాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రణీత అధికారులు పాల్గోన్నారు.

'మా నాయకుడు పోచారం వెంటే మేమంతా'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బాన్సువాడటౌన్, జూన్ 22: మాజీ స్పీకర్ , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఆయన అనుచరులు పట్టణంలోని పోచారం స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు సంక్షేమం , బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసమే తమ నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి , సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. చాలా మంది స్వార్థ ప్రయోజనాల కోసమే పార్టీ మారారని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు , కానీ పోచారం అహర్నిషలు అభివృద్ధి కోసం పాటుపడే గొప్ప నాయకుడన్నారు. గత ప్రభుత్వ హయాంలో బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి బాన్సువాడకు రాష్ట్రంలోనే ప్రత్యేక పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారన్నారు. నిరుపేదలకు గూడు , సంక్షేమ పథకాలు అందించాలనే తపనతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారని , తామంతా కూడా పోచారం వెన్నంటే ఉంటామన్నారు. అంతేకాకుండా పాత కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలను కలుపుకుని పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి , మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ , సొసైటీ చైర్మెన్ ఎర్వల కృష్ణారెడ్డి , మోహన్‌నాయక్ , ఏజాస్ , పోతురెడ్డి , దాసరి శ్రీనివాస్ వెంకన్న ,తదితరులున్నారు.

బీర్కూర్:బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే శనివారం బీర్కూర్‌కు చెందిన ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు త రలివెళ్లారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తాము పోచారం శ్రీనివాస్‌రెడ్డితోనే ఉంటామని అన్నారు. తరలివెళ్లిన వారిలో మండల యువజన విభాగం అధ్యక్షుడు శశికాంత్, ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, కో ఆప్షన్ ఆరీఫ్, నాయకులు దుంపలరాజు, మన్నన్, లాయక్, తదితరులు ఉన్నారు.

సీఎం,ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం

లింగంపేట, జూన్ 22 : లింగంపేట మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ నాయ కులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన్‌ల చిత్రపటాలకు క్షీరాభి షేకాలు చేసి సంబురాలు జరుపుకున్నారు. ఏక కాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని క్యాబినెట్ నిర్ణయించడాన్ని హర్షిస్తూ సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం 10సంవత్సరాలుగా రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో చెప్పిన విధంగా ఒక్కో రైతు కుటుంబానికి రూ.2లక్షలు రుణమాఫీ చేస్తుందని ముఖ్యమంత్రి సాహసోపేతమైన నిర్ణయంతో ఏక కాలంలో రూ.31వేల కోట్లతో రైతులకు రుణ విముక్తి కలిగిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని ఆయన అన్నారు. కార్యక్రమం లో నాయకులు అబ్దుల్ నయీం, రాంరెడ్డి, జొన్నల రాజు, ఫతియోద్దీన్, ప్రసాద్ గౌడ్, కౌడ రవి, అశోక్, జక్సాని రవిలతో నాయకులు ఉన్నారు.

బీబీపేట:రైతులకు ఏకకాలంలో 2లక్షల రుపాయల రుణమాఫీ చేయా లని క్యాబినెట్‌లో తీర్మానం చేయడం హర్షనీయమని మండల మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు నాగారాజుగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.



సీఎం,ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సదాశివనగర్:ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చే విధంగా సీఎం రేవంత్ రెడ్డి రైతురుణమాఫీపై క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తెలపడంపై మండల కాంగ్రెస్ నాయ కులు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్ పాల్గొన్నారు.

రాజంపేట:సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శామయ్య, శ్రీధర్,బన్సిలాల్, తది తరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: సీఎం రైతుల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కార్యకర్తలున్నారు .

యోగా వల్ల మానసిక ప్రశాంతత



యోగా చేస్తున్న పోలీసులు



యోగాసనాలు వేస్తున్న పోలీసులు

కామారెడ్డిటౌన్, జూన్ 22:యోగా వల్ల మానసిక,శారీరక ప్రశాంతత లభిస్తుందని ఏఎస్పీ నరసింహరెడ్డి అన్నారు. శనివారం యోగదినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో యోగా పుట్టడం మన అందరి అదృష్టంగా పేర్కొన్నారు. అందరూ ప్రతి రోజు యోగా ప్రాణయం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ యాకుబ్‌రెడ్డి, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్,మురళి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌లు శేఖర్,కృష్ణ, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి:అంతర్జాతీయ యోగా దినోత్సవం సంద ర్భంగా శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఆవరణలో యోగా మాస్టర్ నాగరాజుగౌడ్ పర్యవేక్షణతో ఎల్లారెడ్డి పోలీ సులచే యోగా చేయించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ యోగాతో శారీరక, మానసిక ఒత్తిడి దూరమవుతుందని,ప్రతీఒక్కరు వారి జీవనశైలిలో యోగను భాగం చేసుకో వాలని అన్నారు. యోగా కార్యక్రమంలో ఎస్ఐ బొజ్జ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు అధిష్టానం

నిర్ణయానికి కట్టుబడి ఉండాలి

- తిమ్మాపూర్ వెంకన్న మీద ప్రమాణం..
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా :మాజీఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడటౌన్, జూన్ 22: ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడమనేది అధిష్టానం తీసుకున్న నిర్ణయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించాడంటే అందులో ప్రభుత్వానికి, పార్టీకి లబ్ది చేకూరే అంశం ఉంటుందనే విషయాన్ని అందరూ గమనించాలన్నారు. చాలామంది కార్యకర్తలు తనకు ఏడుస్తూ ఫోన్ చేశారని, ఎవ్వరూ కూడా దిగాలు పడాల్సిన అవసరం లేదన్నారు. తిమ్మాపూర్ వెంకన్న స్వామి మీద ప్రమాణం చేశానని , బాన్సువాడను వదిలి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. ఇక్కడే ఇంటి నిర్మాణం చేపడతానని, బాన్సువాడలోనే ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అతి తక్కువ కాలంలో తనపై చూపించిన ప్రేమ వెలకట్టలేనిదన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యేగా ఓడిపోయినా, బాన్సువాడలోనే ఉంటూ ఎంపీ సురేష్ షెట్కార్ గెలుపులో బాన్సువాడ నియోజకవర్గం నుంచి 8 వేల ఓట్ల పై చిలుకు మెజార్టీ ఇచ్చామన్నారు. ఎంపీ ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు అధికంగా శ్రమించారన్నారు. కార్యకర్తలే తనకు బలమని , ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మెన్ మాసాని శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొత్తకొండ భాస్కర్, ప్రతాప్‌సింగ్ రాథోడ్, బస్వరాజ్ పటేల్, పుప్పాల శంకర్, మంత్రి గణేశ్ , కౌన్సిలర్లు రమాదేవి, రుక్మిణీ, నందు, వీర్రాజు, మధుసూదన్‌రెడ్డి, మాసీని శేఖర్‌రెడ్డి, అఫ్రోజ్, శ్రావణి, సతీష్ , నాయకులు , కార్యకర్తలు తదితరులున్నారు.

రేషన్ కోటలో ఎక్కువ డీడీలు కడితే జరిమానా

తాడ్వాయి,జూన్ 22:రేషన్ కోటలో సమర్థ్యానికన్న ఎక్కువ డీడీలు కడితే జరిమానాలు విధిస్తామని తాడ్వాయి మండల రేషన్ డీలర్ల సంఘం హెచ్చరిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం రేషన్ లబ్దిదారులు ఎక్కడైనా రేషన్ బియ్యం తీసుకోవచ్చనే నిబంధనలు పెడితే తాడ్వాయి మండలంలో మాత్రం ప్రభుత్వ నిబంధనలకు విరు ద్ధంగా రేషన్ డీలర్ల సంఘం నాయకులు మండలంలోని రేషన్ డీలర్లకు హుకుం జారీ చేశారు. మండల రేషన్ డీలర్లకు తెలియకుండా ఎవరైన కోట కంటే ఎక్కువ డీడీలుచెల్లించినట్లయితే వారికిరూ.20 వేల జరిమానా విధిస్తామనిహెచ్చరించారు. ఈ విషయాన్ని కొందరు రేషన్ డీలర్లు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభు త్వం నిరుపేదల కోసం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పేదలకు సౌకర్యవంతంగా ఎక్కడ ఉంటే అక్కడ వారికి బియ్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.కాని కొందరురేషన్ డీలర్ల సంఘం నాయకులు తమ స్వార్థం కోసం ఎక్కువ డీడీలు చెల్లించ వద్దని, కోటకంటే రేషన్ బియ్యం అమ్మ వద్దని హెచ్చరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు: మాజీ ఎమ్మెల్యే షిండే

నిజాంసాగర్, జూన్ 22:ప్రభుత్వం లేదని ప్రజాప్రతినిధులందరూ కాంగ్రెస్ వైపు మొగ్గుచూ పుతున్నారని కార్యకర్తలు అధైర్యపడవద్దని కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ వస్తుందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే తెలిపారు.శనివారం నిజాంసాగర్ మండలం మల్లూర్ గ్రామం లో బీఆర్ఎస్ సభ్యత్వం పొంది అకాల మృతి చెందిన గొల్లవీరప్ప కోటగిరి రవికు టుంబాలకు పార్టీ ఇన్సూరెన్స్ పథకం కింద రెండేసి లక్షల రూపాయల చొప్పున ఇరువురి కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యేహన్మంత్‌సిండే,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాజు అంద జేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి పథకాలు చేపట్టారకని ఆయన అన్నారు.తాను పార్టీని వీడేది లేదని సచ్చిన బతి కినా బీఆర్ఎస్‌లోనే ఉంటానని తనకు పిడికెడు బువ్వలేని రోజు ఎవరు ముందుకు రాలే దని కేసీఆర్ పుణ్యం వల్లనే రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందానని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, వైసీపీ మనోహర్, పాల్గొన్నారు.

లీకేజీల నీట్‌ను రద్దుచేయాలని సంతకాల సేకరణ

కామారెడ్డిటౌన్, జూన్ 22: ఇటివల నిర్వహించిన నీటి పరీక్ష లీకేజీలకుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యుల మీద చర్యలు తీసుకొని నీట్ పరీక్షని కండక్ట్ చేయాలని డిమాండ్ చేస్తు జిల్లా కేంద్రంలో విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థిసంఘాల బాధ్యులు మాట్లాడుతూ నీటిపరీక్షలు నిర్వహించడానికి బీజేపీ సర్కార్ ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సి)కు బాధ్యతలు అప్పగించి, వైఫల్యం జయంతి 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తులో ఆటలాడడం సిగ్గు చేటన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను అంగట్లో సరుకుగా మార్చిందన్నారు. పేపర్ల లీకేజ్ వ్యవహారంలో ఒక్కో అభ్యర్థినుంచి 30లక్షలకుపైగా వసూలు చేసిన నిందితులను వెంటనే అరెస్ట్‌చేయాలని అన్నారు. విద్యార్థిని అక్రమంగా వసూలు చేసిన డబ్బులను తిరిగి వారికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై సుప్రింకోర్టు సిట్టింగ్ జడ్జీచే సమగ్ర విచారణ జరిపించి బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలన్నారు ఈ కార్యక్రమంలో బీడీఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు ఎల్ఎన్ ఆజాద్, పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కామారెడ్డిటౌన్, జూన్ 22:కామారెడ్డి పట్టణంలోని పెద్దమ్మగల్లిలో దుబ్బాక బాల రాజు (40) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గత కొంతకాలం నుంచి మద్యానికి బానిసైన బాల రాజు ఇంట్లో తరచూ గొడవ పడుతుండే వాడు. ఈనెల 21న అతని భార్య లలిత అనారోగ్యకా రణంగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. దీంతో లలిత తండ్రి కర్రెలక్ష్మయ్య బాలరాజ్ ఇంటికి రాగా ఇంట్లో బాలరాజ్ ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించాడని తెలిపారు.దీంతో మృతుని భార్యకు విషయం తెలుపగా ఆమె వచ్చి చూసేసరికి అతను మృతిచెంది ఉన్నాడని తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామనిసీఐ తెలిపారు.

జనగామలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలి ఆత్మహత్య



లాస్య(ఫైల్)

బీబీపేట,జూన్22: మానసిక పరిస్థితి సరిగా లేక ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గాండ్ల వీణ అలియాస్ లాస్య(32) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐప్రభాకర్ తెలిపారు.లాస్య జనగామ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తుంది. 2015 సంవత్సరం మే 31న సిద్దిపేటకు చెందిన గాండ్ల శ్రావణ్ కుమార్ తో వివాహం జరగగా కొంత కాలంగా ఆమె మాన సిక పరిస్థితి సరిగా లేక హైదరాబాద్‌లో వైద్యం తీసుకుంటుండగా శుక్రవారం రాత్రి ఇంట్లోని పెరటి లో పురుగుల మందుతాగి ఆత్మ హత్యకు పాల్పా డడంతో కామారెడ్డిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చ గా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతుని తండ్రి గాండ్ల రాంచంద్రం ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలి పారు.

నాగిరెడ్డిపేట పోలీసు స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి

నాగిరెడ్డిపేట,జూన్ 22: నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా శని వారం ఆయన పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీస్‌స్టేషన్‌లోని వివిధ రికార్డులన్నింటినీ తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులను, పాత కేసులను,పెండింగ్ కేసుల వివరాలను ఆయన పరిశీలించారు. మండలంలో నేరాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ఆయన స్థానిక పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, స్థానిక ఎస్సై రాజు పాల్గొన్నారు.

రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి కుమారి టీఎస్పీ భార్గవి

బాన్సువాడటౌన్,జూన్ 22: రైతులు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని బాన్సువాడ సివిల్ కోర్టు న్యాయాధికారి కుమారి టీఎస్పీ భార్గవి అన్నారు.శనివారం మండలంలోని తాడ్కోల్ గ్రామంలో గల రైతువేదికలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమెపాల్గొన్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో దుకాణ యజమాని నుంచి బిల్లులు తీసుకోవాలని, ఒకవేళ విత్తనాలు మొలకెత్తని సమయంలో రైతులకు వినియోగదారుల కోర్టులో సమస్యకు పరిష్కారం దక్కుతుందన్నారు.ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి, భూషణ్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

ఆరోపణలు అవాస్తవం

భిక్కనూరు,జూన్22:మండలంలోనికాంచర్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఓల్టేజీ సమస్య ఉందని ఎంపీడీవో ప్రవీన్ కుమార్ తమపై చేస్తున్న ఆరోపణాలు అవాస్తవం అని ట్రాన్స్‌కో-ఏఈ శ్రీనివాస్ అన్నారు.శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ కాంచర్ల పాఠశాలలో ఓల్టేజీ సమస్యలేదన్నారు.పాఠశాలపై ఉన్న ఎల్‌టీ వైర్లు అక్రమంగా తొలగించాలనిచాలా రోజులుగా ఒత్తిడి చేస్తున్నారని తమకు సైతం కొన్ని నిబంధనలు ఉన్నాయని, ఆ నిబంధనలకులో బడే తాము విధులు నిర్వహిస్తామని అన్నారు. భిక్కనూరు గిద్ద హరిజనవాడ సమస్య పరిష్కారానికి తాము సిద్ధంగా ఉన్న వారే తమ కు సహకరించడంలేదన్నారు.ఇప్పటికేడిమాండ్ నోటీసుసైతం అందజేయడం జరిగిందన్నారు. అక్రమమైన పనులు చేయాలని తీవ్ర ఒత్తిడి తేస్తున్న మండల అధికారి ప్రవీన్‌కుమార్ ఇలాంటి ఆరోపణలను మానుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - ఓసీ
దర్శన్ - మహరాజ
ప్రియా 70 - మనమే
ప్రియా 35 - హరోంహర

బాన్సువాడ

మహేశ్వరి - ఓంజీ
వెంకటేశ్వర - నింద

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

